సాక్షి
పశ్చిమగోదావరి
ఆదివారం । 16 । జూలై । 2023



గరికపాటి ప్రవచనాలు

భీమవరం (ప్రకాశంచౌక్): భీమవరంలో ఉద్దరాజు ఆనందరాజు ఫౌండేషన్ ఆధ్వర్యంలో గరికపాటి నర్సింహరావుచే దశోపనిషత్‌ల ఆధ్యాత్మిక ప్రవచన కార్యక్రమం నిర్వహిస్తున్నారు.



శ్రీవారి క్షేత్రం కిటకిట

ద్వారకాతిరుమల: చినవెంకన్న క్షేత్రం శనివారం భక్తులతో కిటకిటలాడింది. వేకువ జాము నుంచి భక్తుల రాక మొదలైంది. క్షేత్రంలోని అన్ని విభాగాలూ రద్దీగా మారాయి.

పారిజాతగిరిలో పూజలు

జంగారెడ్డిగూడెం: గోకుల తిరుమల పారిజాతగిరి వేంకటేశ్వర స్వామి ఆలయంలో శనివారం, త్రయోదశి సందర్భంగా విశేష పూజలు నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చారు.



రౌడీషీటర్లపై ప్రత్యేక నిఘా

- రేంజ్ పరిధిలో 3,340 మంది..
- కేటగిరీల వారీగా విభజన
- 3,340 షీట్ల సమగ్ర పరిశీలన
- ఏలూరు రేంజ్ డీఐజీ అశోక్‌కుమార్



ఏలూరు వన్‌టౌన్ స్టేషన్‌లో రికార్డులు పరిశీలిస్తున్న డీఐజీ అశోక్‌కుమార్, చిత్రంలో ఎస్పీ మేరీ ప్రశాంతి

సాక్షి ప్రతినిధి, ఏలూరు: రౌడీషీటర్లపై పోలీసులు ప్రత్యేక నిఘా పెట్టారు. నేరాల తీవ్రత, రౌడీషీట్ ఉన్న వ్యక్తి నేరం చేస్తున్న తీరు, కేసుల సంఖ్య ఇలా కీలక అంశాలను ప్రామాణికంగా తీసుకుని రౌడీషీటర్లను కేటగిరీ వారీగా విభజించనున్నారు. ఏఎస్పీ, డీఎస్పీ, సీఐ, ఎస్సైలు స్వయంగా ప్రతి షీటర్ పరిస్థితిని పరిశీలించి సమాచారం తెప్పించుకుని ఎస్పీలకు నివేదించేలా పోలీసు ఉన్నతాధికారులు ఆదేశాలు జారీ చేశారు. ఏలూరు రేంజ్ పరిధిలోని ఆరు పోలీస్ జిల్లాల్లో 3,340 మంది రౌడీషీటర్లు ఉన్నారు. వీరిలో 80 శాతం మందిపై 15 ఏళ్లగా రౌడీషీట్ కొనసాగుతోంది. ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో శాంతి భద్రతల పరిరక్షణలో భాగంగా ముందస్తుగా రౌడీషీటర్లపై తీవ్ర నిఘా పెట్టేలా ఏలూరు రేంజ్ డీఐజీ జీవీవీ అశోక్‌కుమార్ ప్రత్యేక ఆదేశాలు ఇచ్చారు.

సమగ్ర దర్యాప్తు

రౌడీషీటర్లను ఆయా పోలీస్‌స్టేషన్లకు పిలిచి సత్ప్రవర్తనతో మెలగడం, గొడవల్లో జోక్యం చేసుకుంటే తీవ్ర పరిణామాలు ఉంటాయని హెచ్చరించి పంపిస్తుంటారు. డీఎస్పీలు, ఎస్పీలు కూడా కౌన్సెలింగ్‌లు ఇస్తుంటారు. అలాగే బైండోవర్ కేసులు నమోదు చేస్తుంటారు. ఇదంతా 15 ఏళ్లగా పోలీస్ శాఖలో రొటీన్‌గా జరుగుతున్న తంతు. రౌడీషీటర్ల నేరాల సంఖ్య, పెండింగ్ కేసులు, ప్రాసిక్యూషన్, రౌడీషీటర్‌కు ఎవరి అండ ఉందనే అంశాలపై సమగ్ర దర్యాప్తు లేదు. ఈ పరిణామాల క్రమంలో నేరాల తీవ్రత కేసుల సంఖ్యకు అనుగుణంగా ఏ, బీ, సీ కేటగిరీలుగా రౌడీషీటర్లను విభజించి చర్యలు తీసుకోనున్నారు. ఇది ఏలూరు రేంజ్‌లో జరుగుతున్న కార్యాచరణ. ఎస్పీలే స్వయంగా ప్రతి షీట్‌ను పరిశీలించి స్థానిక పరిస్థితులు, అధికారుల అభిప్రాయాలకు అనుగుణంగా నిర్ణయం తీసుకోవాలని, అలాగే అవసరమైతే మరికొందరిపై కొత్తగా రౌడీషీట్‌ను తెరవాలని డీఐజీ అశోక్‌కుమార్ ప్రత్యేక ఆదేశాలు ఇచ్చారు.

ఆరు జిల్లాల్లో విభజన ప్రక్రియ

రేంజ్ పరిధిలోని కృష్ణా, తూర్పుగోదావరి, పశ్చిమగోదావరి, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ, కాకినాడ, ఏలూరు జిల్లాల పరిధిలో 3,340 మంది రౌడీషీటర్లు ఉన్నారు. వీరిలో వైట్‌కాలర్ నేరస్తులు మొదలు కిరాతక హత్యలు చేసిన వారు అందరిపై రౌడీషీట్లు ఉన్నాయి. ప్రమాదకరమైన రౌడీల ప్రమేయం ఉన్న కేసులను పోలీసులు క్షుణ్ణంగా పరిశీలిస్తున్నారు. పెండింగ్ కేసుల్లో ట్రయిల్ వేగంగా పూర్తిచేసి శిక్షలు పడేలా చర్యలు తీసుకున్నారు. ప్రతి జిల్లాలో ఎస్పీ నేతృత్వంలో ఏఎస్పీ, డీఎస్పీలు క్రైమ్ రికార్డులను పరిశీలించడంతో పాటు గత పదేళ్లగా రౌడీషీటర్ స్థితిగతులు, నేరప్రవృతి, తెరచాటు వ్యవహారాలు ఇలా అన్నికోణాల్లో పరిశీలించి నివేదికలు ఇస్తే ఎస్పీ తుది నిర్ణయం తీసుకుంటారు. రౌడీషీటర్ సత్ప్రవర్తనతో ఉంటే దానికి అనుగుణంగా చర్యలు ఉంటాయి. అలాగే పోక్సో కేసులు, హింసాత్మక ఘటనలకు పాల్పడేవారు, హత్యలు, తరచూ వివాదాలు, దొమ్మీలు చేస్తున్నవారిని గుర్తించి కొత్తగా రౌడీషీట్ తెరవాలని నిర్ణయించారు. ఏ కేటగిరీలో ఏ ప్లస్ రౌడీషీటర్లు, కీలక కేసుల్లో ఉన్న వ్యక్తులు, బీ కేటగిరీలో కేసుల సంఖ్య ఎక్కువగా ఉన్న వ్యక్తులు, సీ కేటగిరీలో వివాదాలు, గొడవలు, పంచాయితీలు చేస్తున్న రౌడీషీటర్లు ఉండేలా జాబితాలు సిద్ధం చేస్తున్నారు.

జిల్లా	రౌడీషీటర్లు
కృష్ణా	741
పశ్చిమగోదావరి	340
ఏలూరు	592
తూర్పుగోదావరి	729
బీఆర్ అంబేడ్కర్ కోనసీమ	385
కాకినాడ	553

నెలలో వివరాలందించేలా..

ఆరు పోలీస్ జిల్లాల్లో రౌడీషీటర్ల కేటగిరీ విభజనకు సమగ్ర పరిశీలన క్షుణ్ణంగా జరుగుతుంది. నెల రోజుల వ్యవధిలో ప్రక్రియను పూర్తి చేసి అన్ని జిల్లాల నుంచి వివరాలు తీసుకుంటాం. రౌడీషీటర్లపై ఉన్న పెండింగ్ కేసులు వేగంగా పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించాం. నిర్లక్ష్యం వహించే అధికారులపై చర్యలు తప్పవు.

– జీవీవీ అశోక్‌కుమార్, డీఐజీ

గంజాయి రవాణాపై నిఘా

ఏలూరు టౌన్: ఏలూరు రేంజ్ పరిధిలోని జిల్లాల్లో గంజాయి రవాణా, విక్రయాలపై పటిష్ట నిఘా ఏర్పాటుచేశామని డీఐజీ అశోక్‌కుమార్ తెలిపారు. ఏలూరు వన్‌టౌన్ స్టేషన్‌ను ఎస్పీ డీ.మేరీ ప్రశాంతితో కలిసి ఆయన శనివారం ఆకస్మిక తనిఖీ చేసి రికార్డులు పరిశీలించారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ రేంజ్‌లో గంజాయి రవాణాను పూర్తి స్థాయిలో అరికట్టేందుకు కఠిన వైఖరి అవలంబిస్తున్నామన్నారు. సీఎం జగన్ ఆదేశాల మేరకు రాష్ట్రవ్యాప్తంగా గంజాయి రవాణాను అరికట్టేందుకు పటిష్ట కార్యాచరణ అమలు చేస్తున్నామన్నారు. రేంజ్‌లో నాలుగేళ్లలో 910 గంజాయి కేసులు నమోదు చేసి, రెండు వేల మందికి పైగా నిందితులను అరెస్టు చేశామన్నారు. 85 వేల కిలోల గంజాయిని స్వాధీనం చేసుకుని 15 మందిపై పీడీ యాక్ట్‌లు నమోదు చేయగా, మరో 605 మందిపై సస్పెక్ట్ షీట్ తెరిచామని చెప్పారు. గంజాయి, మత్తుపదార్థాల రవాణా, విక్రయాల సమాచారం అందించేలా ప్రభుత్వం 14500 టోల్‌ఫ్రీ నంబర్ ఏర్పాటుచేసిందన్నారు. రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వ నిర్ణయం మేరకు నేరాలు చేసేందుకు భయపడేలా చర్యలు ఉంటాయని డీఐజీ తెలిపారు.

క్రీడాభివృద్ధికి కృషి

కలెక్టర్ ప్రశాంతి



క్రీడా సామగ్రి అందిస్తున్న కలెక్టర్ ప్రశాంతి

భీమవరం (ప్రకాశంచౌక్): విద్యార్థుల్లో క్రీడలపై మక్కువ పెంచేందుకు క్రీడా సామగ్రి దోహదపడుతుందని కలెక్టర్ పి.ప్రశాంతి అన్నారు. శనివారం కలెక్టరేట్‌లో రూ.3 లక్షల విలువైన క్రీడా సామాగ్రిని ఆంధ్రప్రదేశ్ క్రీడా సాధికార సంస్థ బోర్డ్ డైరెక్టర్ కర్రి విజయలక్ష్మికి అందజేశారు. వాలీబాల్, వాలీబాల్ నెట్స్, ఫుట్‌బాల్స్, బాస్కెట్‌బాల్ రింగ్‌నెట్స్, టెన్నికాయిట్ రింగ్స్, టెన్నికాయిట్ నెట్స్, స్కిప్పింగ్ రోప్స్, హై జంప్ పోల్ విత్ క్రాస్ బార్, ఫిట్‌నెస్ కనేస్, క్రికెట్ కిట్స్, క్రికెట్ ఫుల్ మాట్స్ తదితర 14 రకాల క్రీడా సామగ్రిని సమకూర్చారు. తాడేపల్లిగూడెం అసెంబ్లీ నియోజకవర్గంలోని వివిధ పాఠశాలలు, స్లమ్ ఏరియాలో వెనుకబడి ఉన్నవారికి వీటిని పంపిణీ చేయాలని కలెక్టర్ సూచించారు. జిల్లా స్పోర్ట్స్ అథారిటీ చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ ఎండీ హెచ్ మెహర్ రాజ్, జిల్లా చీఫ్ కోచ్ రమేష్ బాబు, కర్రి భాస్కరరావు పాల్గొన్నారు.

స్వచ్ఛ సర్వేక్షణ్‌పై దృష్టి : స్వచ్ఛ సర్వేక్షన్ గ్రామీణ్–2023పై ప్రత్యేక దృష్టి సారించాలని కలెక్టర్ ప్రశాంతి ఆదేశించారు. కలెక్టరేట్ నుంచి స్వచ్ఛ సర్వేక్షణ్ గ్రామీణ్, జగనన్న సురక్ష కార్యక్రమాలపై ఆమె సమీక్షించారు. కార్యాచరణ రూపొందించి పంచాయతీల వారీగా లక్ష్యాలను ఇచ్చామని, పాఠశాలలు, అంగన్‌వాడీ, పంచాయతీ భవనాలు, పబ్లిక్ స్థలాల్లో మురుగునీటి పారుదల, పబ్లిక్ ప్రదేశాల్లో కంటికి కనిపించేంత శుభ్రత, ప్లాస్టిక్ వేస్ట్ నిర్వహణ, గోబర్ధన్ ప్లాంట్ తదితర అంశాలను కూడా పరిశీలించాలని కలెక్టర్ ఆదేశించారు.

న్యూస్‌రీల్

తక్కువ ధరలకు నాణ్యమైన బియ్యం



కౌంటర్‌ను ప్రారంభిస్తున్న జేసీ లావణ్యవేణి

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): ఏలూరు జిల్లాలో ప్రజలకు తగ్గింపు ధరలకు బియ్యం, కందిపప్పు అందించడానికి ఏర్పాట్లు చేశామని జాయింట్ కలెక్టర్ బి.లావణ్యవేణి తెలిపారు. శనివారం స్థానిక పత్తేబాద రైతుబజారులో బియ్యం, కందిపప్పు తగ్గింపు ధరల స్టాల్‌ను ఆమె ప్రారంభించారు. ఏలూరులో రెండు రైతు బజార్లతో పాటు నూజివీడు, కైకలూరు రైతుబజార్లలో, జంగారెడ్డిగూడెం, చింతలపూడిలో ప్రత్యేక స్టాల్స్‌ను ఏర్పాటుచేశామన్నారు. డీఎస్ఓ ఆర్ఎస్ఎస్‌డీ సత్యనారాయణ, ఏడీఎం వి.మహేంద్రనాథ్ తదితరులు పాల్గొన్నారు.

పీఆర్ గూడెం హాస్టల్‌లో సీసీ కెమెరాలు



బాధితులకు ధైర్యం చెబుతున్న డీఎస్పీ

బుట్టాయగూడెం: మండలంలోని పులిరామన్నగూడెం (పీఆర్‌గూడెం) ఆశ్రమ పాఠశాల విద్యార్థి గోగుల అఖిల్ వర్ధన్‌రెడ్డి హత్య నేపథ్యంలో హాస్టల్‌లో శనివారం సీసీ కెమెరాలను ఏర్పాటుచేశారు. వీటిని పోలవరం డీఎస్పీ కె.శ్రీనివాసులు పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సీసీ కెమెరాల్లో అన్ని ప్రదేశాలు కనిపించేలా ఏర్పాట్లు చేశామన్నారు. డీఎస్పీ, జీలుగుమిల్లి ఎస్సై చంద్రశేఖర్ హాస్టల్ విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. విద్యార్థులు అధైర్యపడవద్దని, సీసీ కెమెరాలు ఏర్పాటుచేశామని డీఎస్పీ చెప్పారు. అనంతరం డీఎస్పీ మారుమూల గ్రామమైన ఒర్రింక వెళ్లి మృతిచెందిన అఖిల్ తల్లిదండ్రులు శ్రీనివాసరెడ్డి, రామలక్ష్మిను పరామర్శించి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు.

రోడ్డు పనుల పరిశీలన



పనులను పరిశీలిస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్ పద్మశ్రీ

ఏలూరు(మెట్రో): సత్యవోలు గ్రామంలో రూ.4.33 కోట్లతో చేపట్టిన రోడ్డు పనులను జెడ్పీ చైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ శనివారం పంచాయతీరాజ్ ఇంజనీర్ ఇన్ చీఫ్ బాలునాయక్‌తో కలిసి పరిశీలించారు. సత్యవోలు నుంచి వడ్డిగూడెం వెళ్లే 4.9 కిలోమీటర్ల రోడ్డు పనులు వచ్చే జనవరిలోపు పూర్తిచేయాలని ఆదేశించారు. ఆధునిక ఎఫ్‌డీఆర్ సాంకేతికతతో పనులు చేపట్టనున్నారన్నారు. అనంతరం సత్యవోలులో రైతు భరోసాకేంద్రం, గ్రామ సచివాలయ భవన నిర్మాణాలను ఆమె పరిశీలించారు. పంచాయతీరాజ్ ఎస్ఈ చంద్రభాస్కరరెడ్డి, ఈఈ రమణమూర్తి, డీఈలు లీలా మోహన్, సురేష్, వైఎస్సార్ సీపీ బీసీ సెల్ అధ్యక్షుడు ఘంటా ప్రసాదరావు ఉన్నారు.

సామాజిక తనిఖీ

తాడేపల్లిగూడెం రూరల్: వివిధ శాఖల్లో చేపట్టిన పనులకు సంబంధించి 15వ విడత సామాజిక తనిఖీకి అధికారులు సిద్ధంగా ఉండాలని జిల్లా విజిలెన్స్ అధికారి ఏవీవీ విజయలక్ష్మి అన్నారు. శనివారం స్థానిక మండలపరిషత్ కార్యాలయంలో సామాజిక తనిఖీపై సమావేశం నిర్వహించారు. మండలంలో ఉపాధి హామీ పథకం, పంచాయతీరాజ్ భవనాలకు రూ.11.29 కోట్లతో చేపట్టిన పనుల రికార్డులను సిద్ధం చేయాలన్నారు.

వలంటీర్, సచివాలయ వ్యవస్థలపై ప్రతిపక్షాల దాడి

మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు



జగనన్న సురక్షలో సర్టిఫికెట్లు అందిస్తున్న మంత్రి కారుమూరి, ఎమ్మెల్సీ వంక

తణుకు టౌన్: రాష్ట్రంలో ప్రజలకు సేవలందించే వలంటీర్, సచివాలయ వ్యవస్థలపై ప్రతిపక్షాలు దాడి చేస్తున్నాయని రాష్ట్ర పౌర సరఫరాలు, వినియోగదారుల వ్యవహారాల శాఖ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు అన్నారు. శనివారం తేతలి గ్రామంలో నిర్వహించిన జగనన్న సురక్ష కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వలంటీర్ వ్యవస్థ ద్వారా ప్రతి ఇంటి ముంగిటకే ప్రభుత్వ సేవలు, సంక్షేమ పథకాలు అందుతున్నాయన్నారు. గత టీడీపీ హయాంలో జన్మభూమి కమిటీల పెత్తనంతో ప్రజలు బెంబేలెత్తిపోయారన్నారు. నిస్వార్థంగా సేవలందిస్తున్న వలంటీర్ వ్యవస్థను చంద్రబాబు, పవన్ కళ్యాణ్ క్రిమినల్ శక్తులుగా మాట్లాడటం దుర్మార్గమన్నారు. ఏ ఒక్క వలంటీర్ వారి బెదిరింపులకు భయపడవద్దన్నారు. వలంటీర్ వ్యవస్థ దేశానికే ఆదర్శంగా నిలుస్తుంటే ప్రతిపక్షాలు విషం చిమ్ముతున్నాయన్నారు. గత ప్రభుత్వ హయాంలో జన్మభూమి కమిటీల ద్వారా గాది కింద పందికొక్కుల్లా దోచుకున్నారని ధ్వజమెత్తారు.

నువ్వు విప్లవకారుడా.. పవన్..?

ఒక్కో సినిమాకు కోట్ల రూపాయలు సంపాదించుకునే పవన్ కళ్యాణ్ విప్లవకారుడా అని ఎమ్మెల్సీ వంక రవీంద్రనాథ్ అన్నారు. పవన్ విప్లవకారుడని చెప్పుకుంటే నిజమైన విప్లవకారుల ఆత్మలు ఘోషిస్తాయన్నారు. పవన్ అవగాహనలేని మాటల ద్వారా రాష్ట్రంలోని యువతను తప్పుదోవ పట్టిస్తున్నారని, ఆయనకు ఉద్యోగులకు, వలంటీర్లకు తేడా తెలియదన్నారు. తణుకులో జరిగిన అభివృద్ధిని తన కళ్లతో చూసి మాట్లాడాలని కోరారు. జెడ్పీటీసీ ముళ్లపూడి అన్నపూర్ణదేవి, ఎంపీపీ రుద్ర ధనరాజు, మండల పార్టీ అధ్యక్షుడు బోడపాటి వీర్రాజు, మాజీ ఏఎంసీ చైర్మన్ ఉండవల్లి జానకి, మాజీ సర్పంచ్ కోట నాగేశ్వరరావు, మండల ఎస్సీ సెల్ అధ్యక్షుడు జంగం ఆనందకుమార్, సొసైటీ అధ్యక్షురాలు వై.వి జయమూర్తి, సర్పంచ్ సరెళ్ల క్రాంతి ప్రియ తదితరులు పాల్గొన్నారు.

'జగనన్న సురక్ష' రికార్డు

3,06,304 సర్టిఫికెట్లు అందజేత

భీమవరం (ప్రకాశంచౌక్): జిల్లాలో జగనన్న సురక్ష తొలి విడత క్యాంపుల్లో రికార్డుస్థాయిలో 12 రకాల సేవలకు సంబంధించి 3,06,304 సర్టిఫికెట్లు జారీ చేసినట్టు కలెక్టర్ పి.ప్రశాంతి తెలిపారు. వచ్చేనెల 1వ తేదీ వరకు క్యాంపులు జరుగుతాయని, తొలిదశలో జిల్లాలోని గ్రామ, వార్డు సచివాలయాల పరిధిలో 3,99,541కి 3,20,584 హౌస్ హోల్డ్స్‌ను 6,021 మంది వలంటీర్లు సర్వే చేశారన్నారు. 333 గ్రామ, వార్డు సచివాలయాల్లో 8 విడతలుగా సురక్ష క్యాంపులు నిర్వహించామని, 12 సర్వీసులకు సంబంధించి 2,89,065 టోకెన్లు జారీ చేయగా 3,06,304 సర్వీసులను లబ్ధిదారులకు అందించామన్నారు. కుల ధ్రువీకరణ పత్రాలు 98,199, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు 96,278, ఆధార్ ఫోన్ నంబర్ అనుసంధానం 4,596, సీసీఆర్ కార్డులు 55,600, కొత్త రైస్ కార్డులు 1,225, హౌస్ హోల్డింగ్ మ్యాపింగ్ విభజన 216, జనన ధ్రువీకరణ పత్రాలు 92, మరణ ధ్రువీకరణ పత్రాలు 82, మ్యూటేషన్ లావాదేవీలు 120, కుటుంబ సభ్యుల ధ్రువీకరణ పత్రాలు 204, వివాహ ధ్రువీకరణ పత్రాలు 63, ఇతర సర్టిఫికెట్లు 49,629 జారీ చేశామని కలెక్టర్ వివరించారు.

వలంటీర్లపై పవన్ కళ్యాణ్ వ్యాఖ్యలు దుర్మార్గం



గ్రంధి శ్రీనివాస్, ఎమ్మెల్యే



వంక రవీంద్రనాథ్, ఎమ్మెల్సీ

వీరవాసరం/భీమవరం (ప్రకాశం చౌక్): వలంటీర్ల వ్యవస్థపై పవన్ కళ్యాణ్, చంద్రబాబు, వంగలపూడి అనిత వ్యాఖ్యలు దుర్మార్గమని భీమవరం ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ మండిపడ్డారు. శనివారం వీరవాసరం మండలంలోని వీరవాసరం, రాయకుదురు, భీమవరం పట్టణంలోని 7, 19, 33 వార్డు సచివాలయాల వద్ద జరిగిన జగనన్న సురక్ష సభల్లో ఆయన మాట్లాడారు. దేశంలో ఏ రాష్ట్రంలో లేనివిధంగా ఇంటింటా ప్రభుత్వ పాలనను చేరువ చేసేలా సీఎం జగన్ వలంటీర్ల వ్యవస్థను అమలు చేస్తున్నారని అన్నారు. పేదలకు మేలు జరుగుతుంటే సహించలేని చంద్రబాబు, పవన్ కళ్యాణ్ సీఎం జగన్‌పై అక్కసును వెళ్లగక్కుతున్నారన్నారు. నిస్వార్థంగా వలంటీర్లు సేవలందిస్తుంటే దారుణంగా వ్యాఖ్యలు చేస్తున్న అసలు వీరు మనుషులేనా అని ఆగ్రహం వ్యక్తం చేశారు. నాలుగేళ్లగా వలంటీర్లు రాజకీయాలు, కులాలు, మతాలకు అతీతంగా ప్రజలకు సేవలందిస్తున్నారని గుర్తించుకోవాలన్నారు. కరోనా సమయంలో ప్రాణాలను పణంగా పెట్టి సేవలందించారని అన్నారు. వలంటీర్ల మనోభావాలు దెబ్బతినేలా దారుణ వ్యాఖ్యలు చేయడం తగదన్నారు.

పవన్ కళ్యాణ్ చెప్పేవన్నీ అసత్యాలే..

తణుకు అర్బన్: తణుకులో ఈనెల 14న జరిగిన సభలో పవన్ కళ్యాణ్ మాట్లాడినవన్నీ అవాస్తవాలు, అసత్యాలని ఎమ్మెల్సీ వంక రవీంద్రనాథ్ అన్నారు. తణుకు పార్టీ కార్యాలయంలో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఒక పార్టీ అధ్యక్షుడు తన పార్టీ అజెండా ఏంటి, తనకు అవకాశం ఇస్తే ప్రజలకు ఏంచేస్తానో చెప్పాలే కానీ అధికార పార్టీపై విమర్శలకే ప్రాధాన్యమివ్వడం శోచనీయమన్నారు. పవన్ కళ్యాణ్ తనకు తానే విప్లవకారుడినని చెప్పుకోవడం హాస్యాస్పదమన్నారు. వాస్తవాలు తెలుసుకుని మాట్లాడాలే కాని ప్రజాస్వామ్యానికి వ్యతిరేకంగా మాట్లాడటం బాధాకరమన్నారు. నిస్వార్థంగా సేవలందించడంతో పాటు వేకువజామున పింఛన్ల పంపిణీ, పథకాలను ప్రజలకు చేరువ చేయడంలో వలంటీర్ల సేవలు అమోఘమన్నారు. అటువంటి వలంటీర్ వ్యవస్థను దూరం చేయాలనుకోవడం దుర్మార్గమన్నారు. వలంటీర్లలో 70 శాతం మహిళలే ఉన్నారని, వారిని దూరం చేసి పాతరోజులనే తీసుకువచ్చే ధోరణిలో పవన్ మాట్లాడుతున్నారని విమర్శించారు. ఏఎంసీ మాజీ చైర్మన్ చిట్టూరి శ్రీవెంకట సుబ్బారావు, వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు మంగెన సూర్య తదితరులు పాల్గొన్నారు.

మధ్యాదాయ వర్గాలకు తక్కువ ధరకే స్థలాలు

నూజివీడు: మధ్యాదాయ వర్గాలకు తక్కువ ధరకే ఇళ్ల స్థలాలను అందించేందుకే ఎంఐజీ జగనన్న స్మార్ట్ టౌన్‌షిప్‌లకు రాష్ట్ర ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. నూజివీడులోని విస్సన్నపేట రోడ్డులో మామిడి పరిశోధనస్థానం, ఉద్యాన పాలిటెక్నిక్ కళాశాల పక్కన 40 ఎకరాల్లో ప్రభుత్వం సీఆర్‌డీఏ పర్యవేక్షణలో స్మార్ట్ టౌన్‌షిప్‌ను సిద్ధం చేస్తోంది. ఏడాదికి రూ.18 లక్షలలోపు ఆదాయం ఉన్న వారు ప్లాట్ల కోసం దరఖాస్తు చేసుకోవచ్చు. దీనికి సంబంధించిన వివరాలను శనివారం ఏపీసీఆర్‌డీఏ అడిషనల్ కమిషనర్ షేక్ అలీంబాషాతో కలిసి ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు వెల్లడించారు. లేఅవుట్‌లో గజం రూ.8,500 ధర నిర్ణయించారని, మొత్తం 393 ప్లాట్లు ఉండగా, వీటిలో 240 గజాల ప్లాట్లు 153, 200 గజాల ప్లాట్లు 121, 150 గజాల ప్లాట్లు 119 చొప్పున ఉన్నాయని వారు తెలిపారు. లేఅవుట్‌కు స్థలం కొనుగోలుకు రూ.32 కోట్లు వెచ్చించగా, అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ, రోడ్లు, పార్కులు, ఇతర అభివృద్ధి పనులకు రూ.26 కోట్లను ప్రభుత్వం మంజూరు చేసిందన్నారు. ప్లాట్లు కొనుగోలుకు వచ్చేనెల 19లోపు సీఆర్‌డీఏ వెబ్‌సైట్‌లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సూచించారు.

● టమాటా.. ఊరట



టమాటా ధరలు ఆకాశాన్నంటడంతో ప్రభుత్వం సబ్సిడీపై రైతుబజార్లలో అందుబాటులోకి తీసుకువచ్చింది. కిలో టమాటాలను రూ.50కు విక్రయిస్తున్నారు. దీంతో రోజూ ఉదయం 8 గంటల నుంచి 11 గంటల వరకు ఏలూరు పత్తేబాద రైతుబజార్‌లో టమాటాలు కొనేందుకు ప్రజలు ఇలా బారులు తీరుతున్నారు. - సాక్షి ఫొటోగ్రాఫర్/ఏలూరు

పాఠశాల విద్యాశాఖాధికారిగా శ్యామ్‌సుందర్

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): ఏలూరు జిల్లా పాఠశాల విద్యాశాఖాధికారిగా పి.శ్యామ్‌సుందర్‌ను నియమిస్తూ శనివారం ఉత్తర్వులు వచ్చాయి. ప్రస్తుతం ఈ స్థానంలో పనిచేస్తున్న ఏలూరు ఉప విద్యాశాఖాధికారి ఎన్‌వీ రవిసాగర్ తిరిగి డీవైఈఓగా బాధ్యతలు నిర్వర్తించనున్నారు. శ్యామ్‌సుందర్ గతంలో ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా సమగ్రశిక్ష అదనపు పథక సంచాలకులుగా పనిచేస్తూ జిల్లా విభజన సందర్భంగా పశ్చిమగోదావరి జిల్లా సమగ్రశిక్ష అదనపు పథక సంచాలకులుగా బదిలీ అయ్యారు. ఏలూరు విద్యా శాఖాధికారి కార్యాలయంలో శనివారం రాత్రి ఆయన బాధ్యతలు స్వీకరించారు.

క్లుప్తంగా

వాసవీ విద్యార్థినులకు రిలయన్స్ ఉపకార వేతనాలు



రిలయన్స్ ఉపకారవేతనాలకు ఎంపికైన వాసవీ విద్యార్థినులు

తాడేపల్లిగూడెం : వాసవీ ఇంజినీరింగ్ కళాశాలలో బీటెక్ ప్రథమ సంవత్సరం చదువుతున్న ముగ్గురు విద్యార్థినులు ప్రతిష్టాత్మక రిలయన్స్ ఫౌండేషన్ సంస్థ అందించే ఉపకార వేతనాలకు ఎంపికైనట్టు కళాశాల పాలకవర్గ అధ్యక్ష, కార్యదర్శులు గ్రంధి సత్యనారాయణ, చలంచర్ల సుబ్బారావు శనివారం చెప్పారు. విద్యార్థినులు కొత్తా శ్రీవెంకటతన్మయి, ఉడతా పావని శ్రీలక్ష్మీసావిత్రి, యలమర్తి సబ్దాలు ఉపకార వేతనాలకు ఎంపికయ్యారన్నారు. దేశవ్యాప్తంగా 90 వేల మంది ఉపకార వేతనాలకోసం దరఖాస్తు చేసుకోగా, ఆన్‌లైన్ పరీక్ష ద్వారా 4,500 మంది విద్యార్థులు ఎంపికయ్యారు. వీరిలో వాసవీ విద్యార్థినులు ముగ్గురు ఉన్నారు. ఉపకార వేతనానికి ఎంపికైన విద్యార్థికి రూ.రెండు లక్షల చొప్పున నాలుగు దఫాలుగా అందజేస్తారు. ఒక్కొక్క దఫాకు రూ.50 వేల వంతున విద్యార్థుల బ్యాంక్ ఖాతాకు సొమ్మును జమచేస్తారు.

వెలి కేసులో 8 మందికి రిమాండ్

పెనుగొండ: నడిపూడి శివారు మిద్దేవారిపాలెం వెలి కేసులో ఎనిమిది మంది నిందితులకు కోర్టు రిమాండ్ విధించినట్లు ఎస్సై ఎస్ఎస్ రమేష్ శనివారం చెప్పారు. ఈ కేసులో మొత్తం 11 మంది నిందితులను అరెస్టు చేసి కోర్టులో హాజరుపరచగా, ముగ్గురికి కోర్టు బెయిల్ మంజూరు చేసిందన్నారు. రిమాండ్ విధించిన ఎనిమిది మంది నిందితులను నరసాపురం సబ్ జైలుకు తరలించామన్నారు.

పర్యాటకం.. మరింత ఆహ్లాదకరం

- పశ్చిమలో పర్యాటక అభివృద్ధిపై దృష్టి
- తీర ప్రాంతంలో కొత్తగా మరో ఐదు బీచ్‌ల గుర్తింపు
- ఇప్పటికే ఉన్న బీచ్‌లలో మరిన్ని సౌకర్యాలు
- గోదావరి పరీవాహక ప్రాంతాల వృద్ధికి చర్యలు



పెదమల్లం వద్ద పర్యాటక గెస్ట్ హౌస్ ప్రాంతాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ పి.ప్రశాంతి



పేరుపాలెం బీచ్‌ను పరిశీలిస్తున్న ప్రత్యేక బృందం

భీమవరం (ప్రకాశం చౌక్): గోదావరి నది, సముద్ర తీర ప్రాంతం, పచ్చని పొలాలతో, ప్రసిద్ధి చెందిన దేవాలయాలతో పశ్చిమగోదావరి జిల్లా పర్యాటకులకు ఆహ్లాదాన్ని పంచుతోంది. గోదావరి పరీవాహక ప్రాంతాలతో పాటు సముద్రతీర ప్రాంతాలకు సేద తీరడానికి వస్తున్న పర్యాటకుల సంఖ్య ఇటీవల పెరిగింది. ఈ నేపథ్యంలో పర్యాటక రంగ అభివృద్ధికి ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. దీనిలో భాగంగా జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి రెండు రోజుల క్రితం పర్యాటక శాఖ అధికారులతో ప్రత్యేక సమీక్షా సమావేశం నిర్వహించి జిల్లాలో బీచ్‌ల అభివృద్ధి, రిసార్ట్‌లో సౌకర్యాలు మెరుగుపరచడం, కొత్త బీచ్‌ల గుర్తింపు, బ్ల్యూఫ్లాగ్ బీచ్‌లు, తదితర వాటిపై సమీక్షించి వాటి అభివృద్ధిపై పలు ఆదేశాలు ఇచ్చారు.

దొంగరావిపాలెం, పెద్దమల్లంలో రూ.40 లక్షలతో అభివృద్ధి పనులు

వశిష్ట గోదావరి తీరంలో పర్యాటక శాఖ నిర్వహిస్తున్న సన్‌రైజ్ రిసార్ట్‌లో రూ.20 లక్షలతో లైటింగ్, ఇతర సౌకర్యాలను మెరుగుపర్చడానికి, అలాగే పెద్దమల్లంలో పర్యాటక అతిథి గృహానికి విద్యుత్, మంచినీరు తదితర మౌలిక వసతులను మెరుగుపరిచేందుకు రూ.20 లక్షలతో పనులు చేపట్టనున్నారు. అలాగే ఇక్కడ ఒక వెల్‌నెస్ సెంటర్ ఏర్పాటు చేయడమే కాక, ఒక గైడ్‌ను కూడా నియమించనున్నారు. అలాగే గోదావరిలో బోటింగ్ ఏర్పాటుకు చర్యలు తీసుకోనున్నారు.

పేరుపాలెం బీచ్‌లో రూ.20 లక్షలతో సౌకర్యాలు

మొగల్తూరు మండలం పేరుపాలెం బీచ్ నిత్యం పర్యాటకులతో రద్దీగా ఉంటుంది. ఈ బీచ్‌లో పర్యాటకులు సేదతీరడానికి షెడ్లు, లైటింగ్, మరుగుదొడ్లు తదితర సౌకర్యాలను కల్పించేందుకు రూ.20 లక్షల అంచనాతో ప్రతిపాదనలు సిద్ధం చేశారు.

కుంచనపల్లిలో రెస్టారెంట్

జాతీయ రహదారికి అనుకుని తాడేపల్లిగూడెం వద్ద కుంచనపల్లిలో ఉన్న మూడు ఎకరాల్లో రెస్టారెంట్లు, రెస్ట్ రూమ్స్, పెట్రోల్ బంకు తదితర వాటిని ఏర్పాటు చేయడానికి చర్యలు తీసుకుంటున్నారు.

బ్లూఫ్లాగ్ బీచ్‌లుగా పేరుపాలెం, మోళ్లపర్రు

కేంద్రం ప్రభుత్వం జిల్లాలోని పేరుపాలెం, మోళ్లపర్రు బీచ్‌లను బ్లూఫ్లాగ్ బీచ్‌లుగా గుర్తించింది. ఇటీవల కేంద్రం ప్రభుత్వ అధికారులు ఈ బీచ్‌లను సందర్శించారు. దేశంలో 10 ప్రాంతాల్లోని బీచ్‌లను బ్లూ ఫ్లాగ్ బీచ్‌లను గుర్తించగా వాటిలో 2 బీచ్‌లు జిల్లాలో ఉండడం విశేషం, బ్లూ ఫ్లాగ్ బీచ్‌లు కావడంతో కేంద్ర ప్రభుత్వం అనుమతులు, సహకరంతో మేరకు ఈ రెండు బీచ్‌లను టూరిజమ్ శాఖ ద్వారా అన్ని సౌకర్యాలతో అభివృద్ధి చేయడం జరుగుతుంది.



దొంగరావిపాలెంలో వశిష్ట గోదావరి తీరంలో ఉన్న రిసార్ట్

కొత్తగా మరో ఐదు బీచ్‌ల అభివృద్ధికి చర్యలు

జిల్లాలోని నర్సాపురం, మొగల్తూరు మండలాల్లోని తీరం వెంబడి ఇప్పటికే పేరుపాలెం, మోళ్లపర్రు, కనకదుర్గ బీచ్, కేపీ పాలెం-1, పెదమైనవానిలంక-1 బీచ్‌లు ఉండగా, ప్రస్తుతం మరో ఐదు బీచ్‌లను గుర్తించి వాటిని అభివృద్ధి చేయాలని అధికారులు నిర్ణయించారు. ప్రజల రాకపోకలకు అనుకూలంగా ఉన్న ప్రాంతాల్లో వీటిని గుర్తించారు. వాటికి సంబంధించి మ్యాప్‌ల తయారీకి చర్యలు తీసుకుంటున్నారు. నూతనంగా గుర్తించిన బీచ్‌లలో వేముల దీవి, పెద మైనవానిలంక బీచ్-2, పెదమైనవానిలంక స్టార్టింగ్ పాయింట్ బీచ్, కేపీ పాలెం-2, చల్లావారి బీచ్ ఉన్నాయి. కొత్త బీచ్‌ల ఎంపికతో జిల్లాలో సముద్ర తీరం వెంబడి మొత్తం 10 బీచ్‌లు సిద్ధం కానున్నాయి.

కళాశాలలు, స్కూళ్లల్లో యువ టూరిజమ్ క్లబ్‌లు

జిల్లాలోని ఎంపిక చేసిన కళాశాలల్లో, స్కూళ్లలో 9, 10 తరగతుల విద్యార్థులకు యువ టూరిజమ్ క్లబ్‌లు ఏర్పాటు చేయనున్నారు. ఒకో క్లబ్‌లో 25 నుంచి 30 మంది విద్యార్థులు ఉంటారు. వీరికి జిల్లాలోని పర్యాటక ప్రాంతాలు, వాటి విశిష్టత, టెంపుల్ టూరిజమ్, సంప్రదాయలు, సంస్కృతిపై అవగాహన కల్పిస్తారు. ఈ క్లబ్‌ల ద్వారా జిల్లాలో పర్యాటక ప్రాంతాలపై వారి తల్లిదండ్రులకు, బంధువులకు, వారు ఉండే ప్రాంతాల్లో ప్రజలకు తెలియజేసేలా ఈ క్లబ్‌లను వినియోగిస్తారు.

గోదావరి వెంబడి..

జిల్లాలోని వశిష్ట గోదావరి పరివాహక ప్రాంతంలోని ఆచంట, యలమంచిలి, పాలకొల్లు, నర్సాపురం మండలాల్లో పర్యాటకానికి అనుకులమైన ప్రాంతాలను గుర్తించి అక్కడ అభివృద్ధికి సంబంధించి ప్రతిపాదనలు సిద్ధం చేయాలని కలెక్టర్ ప్రశాంతి పర్యాటక, ఇరిగేషన్, రెవెన్యూ తదితర శాఖల అధికారులకు ఇప్పటికే ఆదేశాలు జారీ చేశారు.

పర్యాటక అభివృద్ధికి చర్యలు



జిల్లాలో గోదావరి, సముద్రం తీరం వెంబడి పర్యాటకంగా అభివృద్ధి చేసేందుకు చర్యలు తీసుకుంటున్నాం. జిల్లాలోని పేరుపాలెం, మోళ్లపర్రు బీచ్‌లను బ్లూ ఫ్లాగ్ బీచ్‌లుగా గుర్తించేలా అభివృద్ధి చేయాలని అధికారులకు ఆదేశాలిచ్చాం. అలాగే మరో 5 కొత్త బీచ్‌లను గుర్తించి వాటి అభివృద్ధి చేస్తాం. ఈ బీచ్‌లలో అన్ని మౌలిక వసతులను కల్పించేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నాం. గోదావరి పరీవాహక ప్రాంతాల్లో బోటింగ్, అలాగే కొన్ని కాలువల్లో కూడా బోటింగ్ ఏర్పాటు చేసేందుకు ప్రణాళికలు రూపొందిస్తున్నాం.

– పి.ప్రశాంతి, కలెక్టర్, పశ్చిమగోదావరి జిల్లా

ఐక్యంగా ముందుకు సాగుదాం



మాట్లాడుతున్న వేండ్ర వెంకటస్వామి

భీమవరం (ప్రకాశం చౌక్): ఎవరు ఏ పార్టీలో ఉన్నా అందరూ ఐక్యంగా ముందుకు సాగాలని గౌడ, శెట్టిబలిజ, శ్రీశైన, యాత, ఈడిగ సంఘ జిల్లా అధ్యక్షుడు వేండ్ర వెంకటస్వామి అన్నారు. పట్టణంలోని పీసీఆర్ కల్యాణ మండపంలో శనివారం ఐదు కులాల ప్రతినిధుల సమావేశం నిర్వహించారు. సమావేశంలో వెంకటస్వామి మాట్లాడుతూ ఐదు కులాలు కలిసికట్టుగా ఉండాలని, ఏ పార్టీలో ఉన్న కూడా కష్టపడి పనిచేసి గుర్తింపు తెచ్చుకుని రాజకీయంగా చైతన్యం కావాలని కోరారు. ఐదు కులాలు బలంగా ఉన్నప్పుడు రాజకీయ అవకాశాలు మన దగ్గరకు వస్తాయన్నారు. చొమ్మేటి వెంకటరెడ్డి, సర్దార్ పాపాన్న గౌడ్, సర్దార్ గౌతు లచ్చన్న విగ్రహాలు ఏర్పాటు చేయలని తీర్మానం చేశారు. మాజీ మంత్రి పి.సత్యనారాయణ, ఎ.రామ్మోహనరావు, పాకా సత్యనారాయణ, గూడూరి ఉమాబాల, కామన నాగేశ్వరరావు, కోడే యుగంధర్, కాండ్రేగుల నర్సింహరావు, పంక బాలయోగి, వేండ్ర శ్రీను పాల్గొన్నారు.

నేడు కేవీకేలో సాంకేతిక ప్రదర్శన

ఉండి: మార్టేరు వ్యవసాయ వరి పరిశోధనా స్థానం స్థాపించి 95 ఏళ్లు పూర్తి కావస్తున్న సందర్భంగా ఉండి మండలం ఎన్నార్పీ అగ్రహారంలోని కేవీకేలో ఆదివారం సాంకేతిక ప్రదర్శనా కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు కేవీకే ప్రోగ్రాం కో–ఆర్డినేటర్ డాక్టర్ ఎస్.మల్లికార్జునరావు శనివారం తెలిపారు. అలాగే కేవీకేలో ఈ నెల 16 నుంచి 18వ తేదీ వరకు పుట్టగొడుగుల పెంపకంపై ప్రత్యేక శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని, ఆసక్తి గల రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

సాక్షి క్లాసిఫైడ్స్

గమనిక

సాక్షి తెలుగు దిన పత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతి స్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటన దారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

విద్యార్థినులపై పీఈటీ లైంగిక వేధింపులు

- విద్యార్థినుల ఆరోపణతో ఎస్ఎఫ్ఐ నాయకుల ధర్నా
- ఘటనా స్థలానికి చేరుకుని విచారణ చేసిన ఆర్డీఓ, డీఈఓ



హైస్కూల్‌లో విచారణ చేస్తున్న ఆర్డీఓ, డీఈఓ

ఆకివీడు: స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో పనిచేస్తున్న పీఈటీ వెంకటేశ్వరరావు తమపై లైంగిక వేధింపులకు పాల్పడుతున్నారని ముగ్గురు విద్యార్థినులు ఆరోపించడంపై ఎస్ఎఫ్ఐ నాయకుల ధర్నాతో స్పందించిన ఉన్నతాధికారులు హైస్కూల్‌లో విచారణ చేశారు. వివరాల్లోకి వెళితే.. సైకిల్ యాత్రలో భాగంగా శనివారం ఎస్ఎఫ్ఐ నాయకులు జెడ్పీ హైస్కూల్‌కు వెళ్లి విద్యార్థుల సమస్యలపై ఆరా తీశారు. ఈ సందర్భంగా తమను పీఈటీ లైంగిక వేధింపులకు గురి చేస్తున్నారని ముగ్గురు విద్యార్థినులు ఆరోపించారు. దీనిపై ఎస్ఎఫ్ఐ నాయకులు పాఠశాల వద్ద ఆందోళనకు దిగారు. దీంతో డీఈఓ వెంకట రమణ, ఆర్డీఓ దాసి రాజు, మహిళా స్త్రీ సంక్షేమ శాఖ పీడీ సుధారాణి, ఎమ్మార్వో విజయలక్ష్మీ, డీవైఈఓ శ్రీనాథ్‌లు పాఠశాలకు చేరుకుని జరిగిన సంఘటనపై విద్యార్థినులతో మాట్లాడారు. ఒక విద్యార్థినితో అసభ్యంగా ప్రవర్తిస్తుండగా తాము చూశామని వారు రాతపూర్వకంగా అధికారులకు ఫిర్యాదు చేశారు. తాకరాని చోట పీఈటీ చేతులు వేశారని ఓ విద్యార్థిని ఫిర్యాదు చేసిందని డీఈఓ వెంకట రమణ, ఆర్డీఓ రాజు విలేకర్లకు చెప్పారు. తహసీల్దార్, పీడీల నివేదికలు, విద్యార్థినుల ఫిర్యాదులపై తుది నివేదిక తయారు చేసి జిల్లా కలెక్టర్‌కు పంపిస్తామని తెలిపారు. కలెక్టర్ ఆదేశాల మేరకు తదుపరి చర్యలు తీసుకుంటామన్నారు.

పోక్సో కేసు నమోదు

స్థానిక పీఐఎస్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో వ్యాయామ ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న కె.వెంకటేశ్వరరావుపై శనివారం రాత్రి పోక్సో కేసు నమోదు చేసినట్లు ఎస్సై.సత్యసాయి చెప్పారు. పాఠశాలలో ఇద్దరు విద్యార్థినులపై అసభ్యంగా ప్రవర్తించిన వ్యాయామ ఉపాధ్యాయుడు వెంకటేశ్వరరావుపై పాఠశాల ఇన్చార్జి ప్రధానోపాధ్యాయురాలు సత్య సావిత్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.





గడపగడపకు సంక్షేమం

తాడేపల్లిగూడెం రూరల్ : కొమ్ముగూడెం గ్రామంలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఓ మహిళకు సంక్షేమ పథకాల వల్ల కలిగిన లబ్ధిని వివరిస్తున్న ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ

పాలకోడేరు విస్సాకోడేరు గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఓ మహిళకు సంక్షేమ పథకాల బ్రోచర్‌ను అందిస్తున్న డీసీసీబీ చైర్మన్ పీవీఎల్ నర్సింహరాజు

ప్రత్యేక కౌంటర్ల ద్వారా తక్కువ ధరకే బియ్యం

- మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు
- తణుకులో ప్రత్యేక కౌంటర్ ప్రారంభం



తణుకులో బియ్యం ప్రత్యేక కౌంటర్ ద్వారా బియ్యం అందిస్తున్న మంత్రి కారుమూరి

తణుకు అర్బన్: మార్కెట్‌లో బియ్యం ధరలను అధిగమించి నాణ్యమైన బియ్యాన్ని తక్కువ ధరకే విక్రయించేలా ప్రత్యేక బియ్యం కౌంటర్‌లు ఏర్పాటు చేసినట్లు రాష్ట్ర పౌరసరఫరాలు, వినియోగదారుల వ్యవహారాల శాఖ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు అన్నారు. తణుకు ఆర్యవైశ్య కల్యాణ మండపం వద్ద పౌరసరఫరాల శాఖ ఆధ్వర్యంలో ట్రేడర్స్‌చే నూతనంగా ఏర్పాటుచేసిన బియ్యం ప్రత్యేక కౌంటర్‌ను శనివారం మంత్రి కారుమూరి ప్రారంభించి మాట్లాడారు. కోవిడ్ సమయంలో రైస్ ట్రేడర్స్ అంతా ఎంతో సాయం అందించి ప్రజలకు ఉపయోగపడ్డారని, బహిరంగ మార్కెట్‌లో బియ్యం ధరలను నియంత్రించేందుకు ట్రేడర్స్‌తో సమావేశం ఏర్పాటు చేసి బియ్యం ధరలు తగ్గించి విక్రయించేలా ప్రణాళిక తయారు చేసి అమ్మకాలు చేస్తున్నట్లు చెప్పారు. ట్రేడర్స్ ఆధ్వర్యంలో ప్రత్యేక బియ్యం కౌంటర్స్ వద్ద బియ్యం ధరల పట్టికను ఏర్పాటు చేసి విక్రయాలు జరిపేలా ఆదేశాలు ఇచ్చినట్లు చెప్పారు. సాధారణ రకం కిలో ధర బహిరంగ మార్కెట్‌లో రూ.42 ఉండగా, తాజాగా రూ. 34లకు విక్రయిస్తున్నట్లు చెప్పారు. ఫైన్ రకం రూ. 45లు ఉండగా రూ. 40లకు, సూపర్ ఫైన్ రకం రూ.55లు ఉండగా రూ. 46లకు విక్రయాలు జరిపేలా నిర్దేశించినట్లు చెప్పారు. రానున్న రోజుల్లో కందిపప్పు ధరను కూడా తగ్గించి విక్రయాలు జరిపే విధానం ఈరోజు ప్రణాళిక రూపొందించనున్నట్లు చెప్పారు. ఈ సందర్భంగా వినియోగదారులకు బియ్యాన్ని తక్కువ ధరకు మంత్రి కారుమూరి చేతులమీదుగా అందచేశారు. ఈ కార్యక్రమంలో సివిల్ సప్‌లెస్ డీఎం టి.శివరాంప్రసాద్, డీఎస్‌వో సరోజ, తహసిల్దారు పీఎన్‌డీ ప్రసాద్, ఏఎంసీ మాజీ చైర్మన్ చిట్టూరి శ్రీవెంకట సుబ్బారావు, వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు మంగెన సూర్య, చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షులు మాజేటి ప్రకాష్, నత్తా కృష్ణవేణి తదితరులు పాల్గొన్నారు.

పురుగుమందు తాగి వ్యక్తి ఆత్మహత్య

ముసునూరు: మద్యం మత్తులో పురుగుమందు తాగి ఓ వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఎస్సై ఎం.కుటుంబరావు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. గుళ్లపూడికి చెందిన దూదిగం రంగారావు (38) మద్యానికి బానిసగా మారాడు. దీంతో భార్యాభర్తల మధ్య తరచుగా గొడవలు జరుగుతున్నాయి. ఈ క్రమంలో శుక్రవారం కూడా మద్యం తాగి ఇంటికి రావడంతో భార్య నిలదీసింది. ఇద్దరి మధ్య గొడవ జరిగి రంగారావు ఇంటి నుంచి బయటికి వెళ్లిపోగా, భార్య కూలి పనికి వెళ్లింది. సాయంత్రం పని నుంచి భార్య తిరిగి వచ్చేసరికి మద్యం మత్తులోనే ఉన్న భర్త వాంతులు చేసుకుంటున్నాడు. దీనిపై ఆమె ప్రశ్నించగా పురుగులమందు తాగినట్లు చెప్పాడు. దీంతో హుటాహుటిన రంగారావును ధర్మాజీగూడెం ఆసుపత్రికి తరలించగా ప్రాథమిక చికిత్స అనంతరం ఏలూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అక్కడ వైద్యులు మెరుగైన చికిత్స కోసం విజయవాడకు రిఫర్ చేశారు. మార్గమధ్యంలో పరిస్థితి విషమించడంతో గన్నవరం ప్రభుత్వాస్పత్రికి తరలించగా, అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. భార్య ఇచ్చిన ఫిర్యాదుపై కేసు నమోదు చేసి, మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి, బంధువులకు అప్పగించినట్లు ఎస్సై తెలిపారు.

ఎస్సీ హాస్టల్‌లో ఘటనపై విచారణ

కాళ్ల: మండల కేంద్రమైన కాళ్లలోని సాంఘిక సంక్షేమ బాలుర వసతి గృహంలో వంటమనిషి విద్యార్థిని గాయపరిచిన సంఘటనపై జిల్లా సాంఘిక సంక్షేమ, సాధికారత అధికారి కె.శోభారాణి శనివారం విచారణ చేపట్టారు. విచారణలో తెలిసిన అంశాల మేరకు హాస్టల్లో వంటమనిషిగా పనిచేస్తున్న ఎం.వెంకటేశ్వర్లుపై క్రమశిక్షణ చర్యల కొరకు ఉన్నతాధికారులకు సిఫార్సు చేస్తామన్నారు. అదేవిధంగా సంఘటనా విషయాన్ని ఆలస్యంగా నివేదించిన భీమవరం అసిస్టెంట్ సాంఘిక సంక్షేమ అధికారిపై కూడా తగు చర్యల కొరకు సిఫార్సు చేశామన్నారు.

క్లుప్తంగా

ఉచిత దంత వైద్య శిబిరం



బాలికలకు ఉచితంగా మందులు పంపిణీ చేస్తున్న గమిని సుబ్బారావు

తాడేపల్లిగూడెం అర్బన్ : డైమండ్ లయన్స్ ఆధ్వర్యంలో స్థానిక బాలికల ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థినులకు ఉచిత దంత వైద్య శిబిరాన్ని శనివారం నిర్వహించారు. లయన్ గట్టిం మాణిక్యాలరావు అమెరికాలో లయన్స్ క్లబ్ గవర్నర్‌గా ప్రమాణ స్వీకారం చేసి స్వదేశానికి వస్తుండటంతో ఈ సేవా కార్యక్రమాన్ని పేరిచర్ల మరళీకృష్ణ అధ్యక్షతన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థినులకు సై్క మల్టీ స్పెషాల్టీ ఆసుపత్రి వైద్యుల సహకారంతో ఉచితంగా దంత వైద్య పరీక్షలు నిర్వహించారు. అవసరమైన వారికి గమిని సుబ్బారావు చేతుల మీదుగా మందులు అందజేశారు. ఈ కార్యక్రమంలో డీవైఈఓ రవీంద్రభారతి, మదన్‌మోహన్ అగర్వాల్, వైద్యులు కేతు కమల, సిబ్బంది, విద్యార్థినులు పాల్గొన్నారు.

రేపు మహిళా కళాశాలలో క్యాంపస్ సెలెక్షన్లు

తణుకు టౌన్ : తణుకు ఎస్‌కేఎస్‌డీ మహిళా కళాశాలలో సోమవారం ఐసీఐసీఐ బ్యాంక్ ఆధ్వర్యంలో క్యాంపస్ సెలక్షన్లు నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ కె.రామకృష్ణ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. అభ్యర్థులు డిగ్రీ పూర్తి చేసి ఉండాలని వివరాలకు 81428 55722, లేదా 99857 20135లో సంప్రదించాలని కోరారు.

పీజీ ప్రవేశ పరీక్షలో ఆదిత్య విద్యార్థుల ప్రతిభ

తాడేపల్లిగూడెం అర్బన్: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పీజీ ప్రవేశ పరీక్ష–2023 వివిధ సబ్జెక్టుల్లో ఆదిత్య డిగ్రీ కళాశాల విద్యార్థులు అత్యుత్తమ ర్యాంకులు సాధించినట్లు ఆదిత్య డిగ్రీ, పీజీ కళాశాల అకడమిక్ డైరెక్టర్ డాక్టర్ బీఈవీఎల్ నాయుడు శనివారం తెలిపారు. జీవ శాస్త్ర విభాగం, గణిత శాస్త్రం విభాగాల్లో ప్రథమ ర్యాంకుతోపాటు 3, 5, 7 ర్యాంకులు, భౌతిక శాస్త్రంలో 2, 8 ర్యాంకులు, రసాయన శాస్త్రంలో 2, 8, 9, 10 ర్యాంకులు, గణాంక శాస్త్రంలో 7,9, కంప్యూటర్ సైన్స్ విభాగంలో 3, 7, 9, 10, ఎలక్ట్రానిక్ విభాగంలో 4, 5 ర్యాంకులను తమ విద్యార్థులు సాధించినట్లు తెలిపారు. ఆదిత్య డిగ్రీ కళాశాలల సెక్రటరీ డాక్టర్ నల్లమిల్లి సుగుణారెడ్డి, ర్యాంకులు సాధించిన విద్యార్థులను అభినందించారు.

జాబ్ మేళాకు అనూహ్య స్పందన



జాబ్‌మేళాలో ఎమ్మెల్సీ కవురు శ్రీనివాస్‌ను సత్కరిస్తున్న కళాశాల యాజమాన్యం

పాలకొల్లు అర్బన్: పట్టణంలోని భూపతిరాజు రామచంద్రరాజు అండ్ గోపాలకృష్ణంరాజు ఛాంబర్స్ డిగ్రీ, పీజీ కళాశాలలో శనివారం నిర్వహించిన మెగా జాబ్ మేళాకు అనుహ్య స్పందన లభించింది. చదువు పూర్తయిన నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు కల్పించడం కోసం కళాశాల యాజమాన్యం పలు కంపెనీల హెచ్‌ఆర్‌లను సంప్రదించి ఉద్యోగాలు కల్పించడం కోసం కళాశాల యాజమాన్యం చేసిన కృషి అభినందనీయమని ఎమ్మెల్సీ కవురు శ్రీనివాస్ అన్నారు. ముందుగా ఆయన జ్యోతి ప్రజ్వలన చేసి జాబ్ మేళాను ప్రారంభించారు. ఉద్యోగాలకు ఎంపికన వారికి నియామక ఉత్తర్వులు అందజేసి అభినందించారు. ఈ సందర్భంగా ఉభయ గోదావరి జిల్లాల నుంచి 1069 మంది హాజరయ్యారు. ఎమ్మెల్సీ కవురు శ్రీనివాస్‌ను కళాశాల యాజమాన్యం శాలువాతో సత్కరించి జ్ఞాపిక అందజేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఎస్సీ కమిషన్ మెంబర్ చెల్లెం ఆనందప్రకాష్, కళాశాల చైర్మన్ కారుమూరి వెంకట నరసింహరావు, కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ కలిదిండి రామరాజు, ప్రిన్సిపాల్ డా.డి వెంకటేశ్వరరావు, ఇంపాక్ట్ హెచ్‌ఆర్ ప్రతినిధులు టి పవన్‌కుమార్, ఎస్ మాధవ్ వర్మ, కళాశాల ప్లేస్‌మెంట్ ఆఫీసర్ కె.లక్ష్మణరావు పాల్గొన్నారు.

400 మందికి వైద్యసేవలు



రోగులకు మందులు అందిస్తున్న దృశ్యం

మొగల్తూరు: ఉచితంగా అందిస్తున్న వైద్య సేవలను సద్వినియోగం చేసుకోవాలని కాళీపట్నానికి చెందిన హెర్మోన్ లివింగ్ వాటర్ మినిస్ట్రీస్ నిర్వాహకులు రెవరెండ్ జోషఫ్‌రాజు కోమనపల్లి, రెవరెండ్ స్వర్ణగీత కోమనపల్లి కోరారు. శనివారం కాళీపట్నంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. శిబిరంలో గుంటూరుకు చెందిన వైద్య నిపుణులు డాక్టర్ నికోలస్ ఇశ్రాయేలు (జనరల్), డాక్టర్ సురేఖ నికోలస్ కోమనపల్లి (క్లినికల్ కార్డియాలజీ), డాక్టర్ ఆర్.దేవి శిరీషలు కంటి వైద్య నిపుణలు సుమారు 400 మందిని పరీక్షించారు. వీరిలో 190 మందికి కళ్లజోళ్లు అవసరం కాగా, 20 మందికి ఆపరేషన్లు చేయాలని, మిగిలిన వారికి ఈసీజీ పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేసినట్లు నిర్వాహకులు తెలిపారు.

జగనన్న సురక్షతో అర్హులకు సంక్షేమ లబ్ధి

తణుకు అర్బన్ : అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందించాలనే లక్ష్యంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జగనన్న సురక్ష కార్యక్రమం చేపట్టారని రాష్ట్ర పౌరసరఫరాలు, వినియోగదారుల వ్యవహారాల శాఖ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు అన్నారు. తణుకులో 22, 23 వార్డుల్లో శనివారం నిర్వహించిన జగనన్న సురక్ష కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. సంక్షేమ లబ్ధి అందకుండా ఏ ఒక్క అర్హుడు ఉండకూడదనే ఉద్దేశంతో ఈ కార్యక్రమం రూపొందించబడిందని చెప్పారు. ఇందులో భాగంగా సచివాలయ వ్యవస్థ ద్వారా అధికార యంత్రాంగం ప్రతి ఇంటిని సందర్శించి అర్హులను జల్లెడ పడుతున్నట్లు స్పష్టం చేశారు. దీంతోపాటు 11 రకాల సేవలకు సంబంధించిన ధ్రువపత్రాలను ఎటువంటి రుసుములు లేకుండా ఉచితంగా పొందే అవకాశాన్ని జగనన్న సురక్ష ద్వారా నెరవేరుస్తున్నారని అన్నారు.

వలంటీర్లపై వ్యవస్థపై పవన్‌వి దిగజారుడు వ్యాఖ్యలు

ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను వలంటీరు వ్యవస్థ లబ్ధిదారుల గడపలోకే చేరుస్తున్న వైనాన్ని పవన్ కల్యాణ్, చంద్రబాబు జీర్ణించుకోలేకపోతున్నారని అందుకే వలంటీరు వ్యవస్థపై ప్రతి సభలోను దిగజారుడు మాటలు మాట్లాడుతున్నారని మంత్రి కారుమూరి ఎద్దేవా చేశారు. ఎవరెన్ని కుయుక్తులు పన్నినా వలంటీరు వ్యవస్థను ఏమీ చేయలేరని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అండగా నిలబడతారని చెప్పారు. ఈ సందర్భంగా జగనన్న సురక్ష శిబిరాల్లో లబ్ధిదారులకు మంత్రి కారుమూరి చేతులమీదుగా ధ్రువపత్రాలను అందచేశారు. ఈ కార్యక్రమంలో మునిసిపల్ ఏఈ రామకిషోర్, ఏఎంసీ మాజీ చైర్మన్ చిట్టూరి శ్రీవెంకట సుబ్బారావు, వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు మంగెన సూర్య, జేసీఎస్ పట్టణ కన్వీనర్ యిండుగపల్లి బలరామకృష్ణ, వైఎస్సార్ సీపీ వైద్యవిభాగం జిల్లా అధ్యక్షుడు డాక్టర్ దాట్ల సుందరరామరాజు, నత్తా కృష్ణవేణి, గెద్దాడ శ్రీకాంత్, షేక్ సలీం, రేలంగి రాంబాబు, కుడుపూడి చంద్రరావు, తాటిపర్తి వాసు, వన్నెంరెడ్డి మురళి, పొట్ల సురేష్, సచివాలయ సెక్రటరీలు, వలంటీర్లు పాల్గొన్నారు.



తణుకు అర్బన్ : మహిళకు ధ్రువపత్రాలు అందిస్తున్న మంత్రి కారుమూరి



ఇరగవరం : జగనన్న సురక్షలో పాల్గొన్న నాయకులు, అధికారులు



అత్తిలి : లక్ష్మీనారాయణపురంలో లబ్ధిదారులకు సర్టిఫికెట్లు అందిస్తున్న దృశ్యం



తాడేపల్లిగూడెం రూరల్ : పడాలలో ధ్రువీకరణ పత్రాల అందజేత

ప్రజా సమస్యల పరిష్కారానికి జగనన్న సురక్ష

ఇరగవరం : ప్రజా సమస్యల పరిష్కారానికి జగనన్న సురక్ష ఎంతగానో ఉపయోగ పడుతుందని ఇరగవరం సర్పంచ్ కంకిపాటి శ్రీనివాస్ అన్నారు. శనివారం ఇరగవరంలో నిర్వహించిన జగనన్న సురక్ష కార్యక్రమంలో లబ్ధిదారులకు ధ్రువీకరణ పత్రాలు అందజేశారు. జెడ్పీటీసీ పంపన అంజిబాబు, కొప్పిశెట్టి అలివేలు మంగతాయారు, సొసైటీ అధ్యక్షులు చవ్వకుల శ్రీనివాస్, ఎంపీటీసీలు మంగెన రామానాయుడు, పాలా పాలేశ్వరరావు, ఎంపీడీవో ఎ.శ్రీనివాస్, సీఎస్‌ఆర్‌వి పోతురాజు, అధికారులు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరికి సంక్షేమ లబ్ధి

అత్తిలి : అర్హులై ఉండి ఏ ఒక్కరూ లబ్ధి అందకుండా మిగిలిపోకూడదన్న లక్ష్యంతో ప్రభుత్వం చేపట్టిన జగనన్న సురక్ష కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని అత్తిలి ఏఎంసీ చైర్మన్ బుద్దరాతి భరణీ ప్రసాద్ కోరారు. శనివారం అత్తిలి మండలం లక్ష్మీనారాయణపురం, ఉరదాళ్లపాలెం గ్రామాల్లో జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. లబ్ధిదారులకు పలు సేవలకు సంబంధించి సర్టిఫికెట్లను అందజేశారు. కార్యక్రమంలో ఎంపీపీ మక్కా సూర్యనారాయణ, జడ్పీటీసీ అడ్డాల జానకి, జెడ్పీ కోఆప్షన్ మెంబర్ మహ్మద్ అబీబుద్దీన్, సర్పంచ్ శింగంశెట్టి శ్రీనివాస్, ఎంపీటీసీ ఆడారి శ్రీనివాసరావు, ఎ శ్రీనివాస్, జిల్లా ప్రధాన కార్యదర్శి వెలగల అమ్మిరెడ్డి, జిల్లా ప్రచార కమిటీ అధ్యక్షుడు పెన్మెత్స రామరాజు, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు పైబోయిన సత్యనారాయణ, నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

అర్హులకు జగనన్న సురక్ష

తాడేపల్లిగూడెం రూరల్: అర్హత ఉండి ప్రభుత్వ పథకాలు అందని వారికి జగనన్న సురక్ష ఒక వరమని జిల్లా పంచాయతీ అధికారి జీవీకే మల్లికార్జునరావు అన్నారు. శనివారం మండలంలోని పడాల, నందమూరు గ్రామంలో జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డీపీఓ మల్లికార్జునరావు మాట్లాడుతూ వివిధ రకాల ధ్రువపత్రాలు అందక చాలా మంది ప్రజలు అర్హత ఉండి ప్రభుత్వ పథకాలు పొందలేకపోతున్నారన్నారు. అటువంటి వారిని గుర్తించి, జగనన్న సురక్ష కార్యక్రమంలో ధ్రువపత్రాలు అందిస్తున్నామన్నారు. అనంతరం 1514, నందమూరులో 856 ధ్రువీకరణ పత్రాలను అందజేశారు. ఆయా కార్యక్రమాల్లో నందమూరు సర్పంచ్ శనగన వరలక్ష్మి, ఉప సర్పంచ్ సరిపల్లి కృష్ణంరాజు, ఎంపీటీసీ సభ్యురాలు వీర్ల జ్యోతి, తహసీల్దార్ వై.దుర్గాకిషోర్, మండల ప్రత్యేకాధికారి ఎ.దుర్గేష్, ఎంపీడీవో ఎం.విశ్వనాథ్, ఈవోపీఆర్‌డీ ఎం.వెంకటేష్, ఏడీఏ పి.మురళీకృష్ణ, ఏవో ఆర్‌ఎస్.ప్రసాద్, కార్యదర్శి కె.శ్రీనివాస్, స్కూలు కమిటి చైర్మన్ గారపాటి గంగాభవాని, నాయకులు కామిశెట్టి శ్రీనివాస్, కామిశెట్టి వినోద్, లింగంపల్లి వేమన, విప్పర్తి ఆనందరావు పాల్గొన్నారు.

ఇరగవరం వైఎస్సార్ సీపీ ఎస్సీ సెల్ అధ్యక్షుడిగా జకబ్



మంత్రి కారుమూరిని కలిసిన జకబ్

ఇరగవరం : మండల వైఎస్సార్ సీపీ ఎస్సీ సెల్ అధ్యక్షుడిగా జకబ్ బాబును రాష్ట్ర పౌరసరఫరాల, వినియోగదారుల వ్యవహారాల శాఖ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు నియమించారు. ఈమేరకు జకబ్ బాబు మంత్రి కారుమూరిని కలిసి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని నాయకులు అందరిని కలుపుకుని పార్టీ గెలుపునకు కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్సీ నాయకులు సబ్బితి రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

క్రీడా పరికరాల అందజేత



క్రీడా పరికరాలను తీసుకుంటున్న కర్రి విజయలక్ష్మి

తాడేపల్లిగూడెం అర్బన్ : స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ ఆధ్వర్యంలో క్రీడా పరికరాలు పంపిణీ చేయనున్నట్లు అథారిటీ డైరెక్టర్ కర్రి విజయలక్ష్మి తెలిపారు. ఈ సందర్భంగా భీమవరం జిల్లా కలెక్టరేట్‌లో జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి చేతుల మీదుగా క్రీడా పరికరాలను విజయలక్ష్మి స్వీకరించారు. విజయలక్ష్మి మాట్లాడుతూ అథారిటీ డైరెక్టర్లకు ఒక్కొరికి రూ.3లక్షలు విలువైన క్రీడా పరికరాలను కొనుగోలు చేసి ఆయా నియోజకవర్గాలోని పాఠశాలలకు ఇచ్చేందుకు ప్రభుత్వం నిధులు మంజూరు చేసిందన్నారు. పరికరాల కొనుగోలుకు కలెక్టర్ ఆధ్వర్యంలో టెండర్లు పిలిచి క్రీడా పరికాలను కొనుగోలు చేశారన్నారు. వాటిని శనివారం డైరెక్టర్లకు అందచేశారని చెప్పారు. జిల్లా క్రీడాభివృద్ధి అధికారి రమేష్‌బాబు, సెట్‌వెల్ సీఈఓ మెహర్రాజు, కర్రి భాస్కరరావు పాల్గొన్నారు.

దుర్గాబాయి దేశ్‌ముఖ్ జయంతి

పాలకొల్లు సెంట్రల్: పట్టణ పరిధిలోని జీవీఎస్వీఆర్‌ఎం మున్సిపల్ ప్రాథమిక పాఠశాలలో దుర్గాబాయి దేశ్‌ముఖ్ జయంతి వేడుకలు శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం టీచర్ సీహెచ్ శశికళ మాట్లాడుతూ దుర్గాబాయి దేశ్‌ముఖ్ గొప్పతనాన్ని వివరించారు. కార్యక్రమంలో బి.త్రిమూర్తులు, చంద్రకళ, బొక్క భవాని, దుర్గ తదితరులు పాల్గొన్నారు.

వెంకన్నకు ప్రత్యేక పూజలు

నరసాపురం రూరల్: మండలంలోని మేములదీవి గ్రామం కాపులకొడపలో ఉన్న వేంకటేశ్వర స్వామి ఆలయానికి శనివారం భక్తులు పోటెత్తారు. పెద్ద ఎత్తున చేరుకున్న భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించి తలనీలాలను సమర్పించడం, స్వామివారికి ఏడు వారాల ప్రదక్షిణలు చేశారు. ఈ సందర్భంగా స్వామి వారిని ప్రత్యేకంగా అలంకరించారు. అనంతరం ఆలయ ఆవరణలో అన్నసమారాధన నిర్వహించారు.

ప్రతి గడపకూ ప్రభుత్వ సంక్షేమ పథకాలు

ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ

తాడేపల్లిగూడెం రూరల్: రాష్ట్రంలోని ప్రతి గడపకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందుతున్నాయని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ అన్నారు. శనివారం రాత్రి మండలంలోని పట్టింపాలెం, కొమ్ముగూడెం గ్రామాల్లో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికి తిరిగి ప్రభుత్వ సంక్షేమ పథకాల ద్వారా ప్రజలకు చేకూరిన లబ్ధిని వివరించారు. మంత్రి కొట్టు సత్యనారాయణ మాట్లాడుతూ రాష్ట్రంలో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో ప్రజలు సంతోషంగా ఉన్నారన్నారు. రాబోయే ఎన్నికల్లోనూ తిరిగి సీఎం జగన్‌ను అధికారంలోకి తీసుకొచ్చేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు. అనంతరం పట్టింపాలెంలో సచివాలయాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ ముత్యాల ఆంజనేయులు, సర్పంచ్‌లు బొణిగే పోతన, రాజమహేంద్రవరపు లక్ష్మణరావు, వైస్ ఎంపీపీలు సూర్పని రామకృష్ణ, కట్టా రంగబాబు, ఎంపీటీసీ సభ్యులు జంపెల్లి సత్యవతి, మార్లపూడి సుబ్బారావు, చినతాడేపల్లి ఉప సర్పంచ్ చిట్టూరి కాశీవిశ్వనాథం, మండల వ్యవసాయ సలహా మండలి చైర్మన్ ముప్పిడి పెద్దబ్బులురెడ్డి, సొసైటీ చైర్మన్లు జడ్డు హరిబాబు, వెలిశెట్టి నరేంద్రకుమార్, చిక్కాల సత్యనారాయణ, గుమ్మళ్ల తాతారావు, నాయకులు ముప్పిడి సంపత్‌కుమార్, గారపాటి వైకుంఠం, కొల్లా విజయలక్ష్మికుమారి, ముద్రగడ లలితకుమారి, నూనె రాధాకుమారి, బొద్దాని శ్రీనివాస్, రామచంద్రారెడ్డి పాల్గొన్నారు.



పట్టింపాలెంలో మాట్లాడుతున్న ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ

గూడెంలో 4.8 మిల్లీ మీటర్ల వర్షపాతం

తాడేపల్లిగూడెం రూరల్: పట్టణ, పరిసర గ్రామాల్లో గడిచిన 24 గంటల్లో 4.8 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదైందని తహసీల్దార్ వై.దుర్గాకిషోర్ తెలిపారు. ఈ మేరకు శనివారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. అలాగే పెంటపాడు మండలంలో 1.0 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదైందని పేర్కొన్నారు.

మణిపూర్ ఘటనపై మహిళా సమాఖ్య నిరసన

తణుకు : మణిపూర్ హింసాకాండ ప్రాంతాల్లో పర్యటించి బాధిత కుటుంబాలను పరామర్శించి నవారిపై నమోదు చేసిన కేసులను ఉపసంహరించుకోవాలని ఏపీ మహిళా సమాఖ్య జిల్లా ప్రధాన కార్యదర్శి సికిలే పుష్పకుమారి డిమాండ్ చేశారు. శనివారం తణుకు పైడిపర్రు జంక్షన్‌లో ఏపీ మహిళా సమాఖ్య తణుకు శాఖ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పుష్పకుమారి మాట్లాడుతూ భారత జాతీయ మహిళా సమాఖ్య జాతీయ ప్రధాన కార్యదర్శి అనీరాజా, జాతీయ ఉపాధ్యక్షురాలు నిషా సిద్దు, ప్రముఖ న్యాయవాది దీక్షా ద్వివేదీలపై అక్రమ కేసులు నమోదు చేయడం సరికాదన్నారు. ఇప్పటికే రెండు నెలలుగా మణిపూర్‌లో జరుగుతున్న హింసాకాండలో సుమారు 200 మంది హత్యకు గురికాగా వేలాది మంది క్షతగాత్రులుగా మారి ప్రాణాలను అరచేత పెట్టుకుని శిబిరాల్లో తలదాచుకుంటున్నారని అన్నారు. వీరిని కనీసం దేశ ప్రధాని నరేంద్రమోదీ పరామర్శించకపోవడం శోచనీయమన్నారు. ఈ కార్యక్రమంలో సమాఖ్య జిల్లా ఉపాధ్యక్షురాలు సావరపు దేవి, పిండి సత్యవతి, పసుపులేటి దానమ్మ, మేకా వెంకటలక్ష్మి, పుట్టపు కృష్ణవేణి, కవల మంగతాయారు, మీసాల జయలక్ష్మి, డి.లక్ష్మీదేవి, అడపా లక్ష్మి, కోన రత్నకుమారి పాల్గొన్నారు.



తణుకులో నిరసన చేపట్టిన మహిళా సమాఖ్య నాయకులు

రహదారి భద్రతపై డ్రైవర్లకు అవగాహన

తణుకు : విద్యాసంస్థలకు చెందిన బస్సులు నడిపే డ్రైవర్లు ప్రమాదాల నివారణపై అవగాహన కలిగి ఉండాలని జిల్లా ఉపరవాణా అధికారి టి.ఉమామహేశ్వరరావు అన్నారు. తణుకు రవాణాశాఖ కార్యాలయం పరిధిలో డ్రైవర్లకు స్థానిక మాంటిస్సోరి స్కూలు ఆవరణలో శనివారం ఏర్పాటు చేసిన రోడ్డు భద్రత అవగాహన సదస్సులో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. తణుకు మోటారు వెహికల్ ఇన్‌స్పెక్టర్ జి.సంజీవ్‌కుమార్ మాట్లాడుతూ స్కూలు, కాలేజీ బస్సులు నడిపే డ్రైవర్లు ఎప్పటికప్పుడు వాహనం స్థితిగతులను చూసుకుని పరిమిత వేగంతో విద్యార్థులను సురక్షితంగా గమ్యస్థానాలకు చేర్చాలని సూచించారు. రోడ్డు భద్రత శిక్షణ అధికారి జలమయ్య డిజిటల్ స్క్రీన్‌పై డ్రైవర్లకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా డీటీవో ఉమామహేశ్వరరావు, ఎంవీఐ సంజీవ్‌కుమార్‌లను ప్రైవేటు విద్యాసంస్థల యూనియన్ నాయకులు ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు అనపర్తి ప్రకాశరావు, ఎంఎస్‌ఆర్ ఆంజనేయులు, పెన్మత్స రామరాజు, నాసరి రాజశేఖర్, డ్రైవర్లు, సిబ్బంది పాల్గొన్నారు.



రవాణాశాఖ అధికారులను సన్మానిస్తున్న యూనియన్ నాయకులు

డిజిటల్ విద్యకు పెద్దపీట

నరసాపురం రూరల్: డిజిటల్ విద్యా విధానానికి రాష్ట్ర ప్రభుత్వం పెద్ద పీట వేస్తుందని జిల్లా విద్యాశాఖ అధికారి (డీఈవో) ఆర్ వెంకటరమణ అన్నారు. డిజిటల్ టెక్నాలజీ పై గత 10 రోజులుగా స్థానిక స్వర్ణాంధ్ర ఇంజనీరింగ్ కళాశాలలో ఉపాధ్యాయులకు ఇస్తున్న శిక్షణా తరగతుల ముగింపు కార్యక్రమంలో సమగ్ర శిక్ష అడిషనల్ ప్రాజెక్టు కో ఆర్డినేటర్ శ్యామ్ సుందర్‌తో కలసి ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా డీఈవో మాట్లాడుతూ విద్యలో వినూత్న, విప్లవాత్మక మార్పులను డిజిటల్ టెక్నాలజీ తీసుకు వస్తుందన్నారు. గతేడాది 8వ తరగతి విద్యార్థులకు బైజూస్ ట్యాబ్స్ ఇవ్వడం ద్వారా డిజిటల్ టెక్నాలజీకి రాష్ట్ర ప్రభుత్వం శ్రీకారం చుటిందన్నారు. ఈ ఏడాది ప్రాథమిక పాఠశాలల్లో స్మార్ట్ టీవీలు, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల్లో ఇంటరాక్టివ్ ఫ్లాట్ ప్యానల్స్ (ఐఎఫ్‌పీ) ఏర్పాటు చేసినట్లు చెప్పారు. వాటిని ఏవిధంగా వినియోగించి విద్యార్థులకు డిజిటల్ విద్య అందించాలనే అంశంపై ఉపాధ్యాయులకు ఈ శిక్షణను ఇచ్చామన్నారు. ఈ శిక్షణ కార్యక్రమంలో నరసాపురం, మొగల్తూరు, పోడూరు, ఆచంట, పెనుమంట్ర మండలాలకు చెందిన ఉపాధ్యాయులకు ఒక్కో బ్యాచ్‌కు రెండు రోజులు చొప్పున 10 రోజుల పాటు డిజిటల్ విద్యాబోధన పై శిక్షణ ఇచ్చామని కోర్సు కో ఆర్డినేటర్ ఏఎంవో జాన్ ప్రభాకర్ అన్నారు.

దేవస్థానం చైర్మన్లకు సత్కారం

పాలకొల్లు అర్బన్: పంచారామ క్షేత్రంగా ప్రసిద్ధిచెందిన శ్రీ క్షీరారామలింగేశ్వర స్వామి ట్రస్ట్‌బోర్డు చైర్మన్‌గా కోరాడ శ్రీనివాసరావు, అలాగే యడ్లబజారులో ఉన్న శ్రీ కనకదుర్గమ్మ దేవస్థానం చైర్మన్‌గా కావలి శ్రీనివాసరావులు రెండోసారి పదవీ బాధ్యతలు స్వీకరించిన సందర్భంగా శ్రీ వేంకటేశ్వరస్వామిని శనివారం దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ చైర్మన్ జోగి వెంకటేశ్వరరావు స్వాగతం పలికి స్వామివారి శేషవస్త్రాలతో సత్కరించి అభినందనలు తెలిపారు. ఆయనతో పాటు శ్రీ కనకదుర్గమ్మ దేవస్థానం ట్రస్ట్‌బోర్డు సభ్యులు రేలంగి నరసింహరావు (దున్ను) కూడా స్వామివారిని దర్శించుకున్నారు.

నేడు రోటరీ క్లబ్ పాలకవర్గ ప్రమాణ స్వీకారం

పాలకొల్లు అర్బన్: రోటరీ క్లబ్ ఆఫ్ పాలకొల్లు నూతన కార్యవర్గం ఆదివారం సాయంత్రం 5గంటలకు పాలకొల్లు లయన్స్ కమ్యూనిటీ హాలులో పదవీ ప్రమాణ స్వీకారం చేయనున్నారు. అధ్యక్షుడిగా పెనుమాక రామమోహన్‌రావు, కార్యదర్శిగా రావాడ సతీష్, కోశాధికారిగా ముత్యాల శ్రీవాత్సవ ప్రదీప్ బాధ్యతలు స్వీకరించనున్నారు. రోటరీ డిస్ట్రిక్ట్ గవర్నర్ యల్లారి కల్యాణ చక్రవర్తి, డా. సీహెచ్ సత్యనారాయణమూర్తి, ఎమ్మెల్సీ కవురు శ్రీనివాస్, రోటరీ అసిస్టెంట్ గవర్నర్ యిమ్మిడి రాజేష్ తదితరుల సమక్షంలో పదవీ బాధ్యతలు స్వీకరించనున్నట్లు కార్యదర్శి రావాడ సతీష్ తెలిపారు.

తల్లి, కుమార్తె అదృశ్యంపై ఫిర్యాదు

పాలకొల్లు అర్బన్: మండలంలోని చింతపర్రుకి చెందిన గూడవల్లి దుర్గాభవాని (29), ఆమె కుమార్తె బిందుహర్షిణి (8) ఈ నెల 10వ తేదీ నుంచి కనిపించుటలేదని గూడవల్లి చంద్రశేఖర శ్రీనివాస్ శనివారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. బంధువుల ఇంట, తల్లిదండ్రుల ఇంటి వద్ద, మిత్రుల ఇళ్ల వద్ద వెదికినట్లు ఆచూకి లభించలేదని ఆ ఫిర్యాదులో పేర్కొన్నారు. రూరల్ ఎస్సై ఎస్ శ్రీనివాసరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

జనం లేక బస్ యాత్ర వెలవెల

మొగల్తూరు: టీడీపీ నిర్వహిస్తున్న భవిష్యత్‌కు గ్యారంటీ బస్సు యాత్రకు జనం లేక వెలవెలబోయింది. శనివారం నరసాపురం నుంచి ర్యాలీగా తరలివచ్చిన మాజీ మంత్రులు, ఎమ్మెల్యేలు స్థానిక గాంధీబొమ్మల సెంటర్‌కు సభకు వచ్చే సమయానికి జనం లేక నాయకులు విస్తుపోయారు. ఈ సందర్భంగా జరిగిన సభలో పలువురు మాజీ మాజీమంత్రులు మాట్లాడుతూ జగన్‌మోహనరెడ్డిపైనే ఆరోపణలు చేశారు. తాము అధికారంలోకి వస్తే ఏం చేశామో? చెప్పకపోవడంపై స్థానికులు విమర్శలు గుప్పిస్తున్నారు. మాజీ హోం మంత్రి నిమ్మకాయల చిన్నరాజప్ప, జ్యోతుల నెహ్రూ, పితాని సత్యనారాయణ, పీతల సుజాత, ఎమ్మెల్యేలు రామరాజు, రామానాయుడు, షరీఫ్, అంగర రామ్మోహన్ పాల్గొన్నారు.

ప్రభుత్వ బియ్యం దుకాణం ఏర్పాటు

ఉండి: రాష్ట్ర ప్రభుత్వం తక్కువ ధరలకే బియ్యం అందజేస్తున్నట్లు మండల ప్రత్యేకాధికారి ఎం.రవికుమార్ తెలిపారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు ఉండి కోఆపరేటివ్ బ్యాంక్ గోడౌన్ వద్ద పౌరసరఫరాల శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన బియ్యం కౌంటర్లను శనివారం రవికుమార్, ఇన్‌చార్జి తహసీల్దార్ ఎస్వీఎస్ నాయుడు ప్రారంభించి మాట్లాడారు. బియ్యం సాధారణ రకాలు కిలో రూ.34, రూ.40, సూపర్ ఫైన్ రకం రూ.46కే అందిస్తున్నట్లు చెప్పారు.

22న ప్రత్యేక లోక్‌అదాలత్

భీమవరం (ప్రకాశంచౌక్): భీమవరం కోర్టు పరిధిలోని మోటారు వాహన ప్రమాద బీమా నష్ట పరిహార కేసులు, భూ నష్ట పరిహార కేసులు రాజీ చేసుకొనేందుకు భీమవరంలో ఈ నెల 22న ప్రత్యేక లోక్‌అదాలత్ నిర్వహించనున్నట్టు మూడో అదనపు జిల్లా న్యాయమూర్తి పి.సత్యాదేవి తెలిపారు. ఈ మేరకు ఇన్సూరెన్స్ కంపెనీల ప్రతినిధులు, న్యాయవాదులతో శనివారం ఆమె సమీక్షా సమావేశం నిర్వహించారు.